క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కారెంపూడి: ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం కారెంపూడి ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాల, నరసరావుపేట ఆధ్వర్యంలో అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్, హెల్త్ కార్డులు ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9133667555ను సంప్రదించాలని కోరారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిర్డీ సాయి ఆలయంలో గురువారం భక్తులు సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి సాయినాథునికి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరం



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలోనున్న ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గోలి గ్రామ శివారులోనున్న సర్వే నంబర్ 494/48లోని 14.20 ఎకరాలు, సర్వే నంబర్ 679లోని 5.88 ఎకరాలు మొత్తం 20.08 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వో కుమార్ స్వామి, గ్రామ సర్వేయర్ నవులూరి రవీంద్రరెడ్డి ఆ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయండి



కారెంపూడి: పోయిన సెల్ ఫోన్‌ను రికవరీ చేసి పోగొట్టుకున్న వ్యక్తి గుంటూరుకు చెందిన కోసూరు కృష్ణసాయికి కారెంపూడి ఎస్ఐ కె.అమీర్ గురువారం రాత్రి అందించారు. గత నెల 16వ తేదీన కృష్ణ సాయి కారెంపూడికి పని నిమిత్తం వచ్చి టీ స్టాల్ వద్ద తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అతనిచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దర్యాప్తు చేసి సెల్ ఫోన్‌ను రికవరీ చేసి బాధితునికి అందించారు. ఎవరైనా సెల్ పోగొట్టుకున్నట్లయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ అమీర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన పట్టణంలోని అమరావతి మేజర్ కాలువ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బండారు నరేంద్ర (29) మాంసం కోసి పట్టణంలోని రెస్టారెంట్లకు అందిస్తుంటాడు. ఈ క్రమంలో పొట్టేలు తోలు విక్రయించేందుకు స్నేహితుడు అప్పాపురం భూపతితో కలిసి సత్తెనపల్లి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇరువురు వెళుతుండగా అమరావతి మేజర్ కాలువ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో బండారు నరేంద్ర మృతి చెందాడు. స్నేహితుడు భూపతికి తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అభం శుభం తెలియని ఆడపిల్లలతో ఎలా జీవించాలి, తమకు దిక్కెవరు దేవుడా అంటూ రాజేశ్వరి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడికి గురి చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పలు పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు

- ఏకపక్షంగా సాగిన ఎన్నికల ప్రక్రియ
- కూటమి నేతలకు సహకరించిన అధికార యంత్రాంగం

దాచేపల్లి : స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు మండల వ్యాప్తంగా గురువారం జరిగాయి. దాచేపల్లి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా అంబటి రవి, వైస్ చైర్మన్‌గా షేక్ షఫియా, జెడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా షేక్ హఫీజ్, వైస్ చైర్మన్‌గా షేక్ జానీబేగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేసానుపల్లి హైస్కూల్ చైర్మన్‌గా మీసాల ఆదాం, ముత్యాలంపాడు హైస్కూల్- కోట కోటేశ్వరరావు, ప్రాథమిక పాఠశాల-రమావత్ కిషన్ నాయక్, తంగెడ జెడ్పీ హైస్కూల్- దూదేకుల సైదుహుస్సేన్‌తో పాటు అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్స్, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కమిటీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను మాజీ సర్పంచ్‌లు తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, షేక్ వలి, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, నాయకులు పగడాల భాస్కర్‌రావు, నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, బుల్లిబ్బాయి తదితరులు సన్మానించారు. ఎన్నికల ప్రక్రియ అంతా ఏకపక్షంగా జరిగింది. కూటమికి చెందిన నాయకుల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో కూటమి నేతలకు సహకరించారు. ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ వైవీ. కుటుంబరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి, ఎంఈవోలు కాంతారావు, పినాకపాణిలు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా పాఠశాలల కమిటీ ఎన్నికలు

కారెంపూడి: మండలంలో 43 ప్రభుత్వ పాఠశాలలకు గాను 42 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం జరిగాయి. మోడల్ స్కూల్లో మాత్రం అక్కడ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడనే ఘటన నేపథ్యంలో ఎన్నిక జరగలేదు. కారెంపూడి మెయిన్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా బాణావతు నాగేశ్వరరావు నాయక్ ఎన్నికయ్యారు. ఎన్నికను హెచ్ఎం పుల్లమ్మ నిర్వహించారు. అలాగే 27 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీ స్కూల్స్, 9 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్‌కు- మందం రామ కోటేశ్వరరావు, చింతపల్లి జెడ్పీ హైస్కూల్-బత్తుల పిచ్చెమ్మ, పెదకొదమగుండ్ల జెడ్పీ హైస్కూల్- వీరవల్లి లక్ష్మీనారాయణ, మిరియాల జెడ్పీ హైస్కూల్- తిప్పాబత్తుల శ్రీనివాసరావు, కారెంపూడి జెడ్పీ హైస్కూల్- బాణావతు బాలూనాయక్ చైర్మన్లుగా ఎన్నికయ్యారని ఎంఈవోలు కె.కాంతారావు, పి.రవి కుమార్‌లు తెలిపారు. మిగతా పాఠశాలల చైర్మన్‌ల వివరాలు అందాల్సి ఉందని పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా కమిటీల ఎన్నికలు

మాచర్ల రూరల్: మండలంలోని 4 జెడ్పీ హైస్కూల్స్, 56 ఎంపీపీ, యూపీ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవో అల్లి సురేష్ పర్యవేక్షణలో ఆయా పాఠశాలల్లోని హెచ్ఎంల నేతృత్వంలో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. మండలంలోని కొప్పునూరు జెడ్పీహెచ్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎన్‌టీ వీరాంజనేయులు, వైస్ చైర్మన్‌గా అల్లి కుమారి, జమ్మలమడక పాఠశాల చైర్మన్‌గా చింతా శ్రీను, కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ చైర్మన్‌గా ఓర్సు శివపార్వతి, వైస్ చైర్మన్‌గా కలివెల సామేలు, తాళ్ళపల్లి చైర్మన్‌గా దుర్గారావు ఎన్నికయ్యారు. కొత్తపల్లి ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా మేరి కుమారి, అలుగురాజుపల్లి- రామిశెట్టి కొండలు, అచ్చమ్మకుంట- శివకేశవ్ నాయక్, భైరవునిపాడు-పి .అనంతరామయ్య, ద్వారకాపురి-గన్నెబోయిన నాగరాజు, కంభంపాడు- పెద కోటయ్య, మతుకుమల్లి- టి.అర్జున్, రేగులవరం- వి.రత్నానాయక్, తాళ్ళపల్లి మూడు పాఠశాలలకు రోజా, ఎన్.విజయ సాగరి, వీరబ్రహ్మం, కంభంపాడు ఎస్సీ పాఠశాల ప్రేమలత, గన్నవరం- రావుల నాగేంద్ర, కొత్తపల్లి ఎస్సీ పాఠశాల ఆలేటి విజయ్‌కుమార్, రాయవరం ఆర్‌సీఎం - బూసా శ్రీనివాసరావు తదితర పాఠశాలల్లో పలువురు చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఐవీ నాగమణి, విజయకుమారి, కెనడి, సంపత్ కుమార్, కిరీటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

34 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో నున్న 34 పాఠశాలలకు గురువారం నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు పూర్తయినట్లు ఎంఈవో-2 వై.శివనాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి వారి తల్లిదండ్రులు 50 శాతం మందికి పైగా హాజరు కావాల్సి ఉందన్నారు. తుమ్మకోట ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో 97 మందికి 20 మంది, తుమ్మకోట జెడ్పీ హైస్కూల్‌లో 225 మందికి 22 మంది, పాలువాయి జెడ్పీ హైస్కూల్‌లో 179 మందికి 11 మంది తల్లిదండ్రులు హాజరు కావడంతో ఆ పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందని హెచ్ఎంలు కె.వెంకటేశ్వరరావు, రామ్‌మోహన్‌రెడ్డి, ప్రమీల తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

గురజాల : పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మండల విద్యాశాఖాధికారులు కె.కాంతరావు, ఎస్.సాంబశివరావులు తగు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలు-10, ప్రాథమిక-27, ప్రాథమికోన్నత- 3 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అన్ని పాఠశాలల్లో యాజమాన్య ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీలచే ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రతిజ్ఞ చేయించారు.

ఏకగ్రీవంగా ఎస్ఎంసీ ఎన్నికలు

విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పాత్లావత్ రాంచంద్ నాయక్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం యూ లక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా చైర్మన్‌గా రామ్ చంద్ నాయక్, వైస్ చైర్మన్‌గా ఆడెపు ధనలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే స్థానిక క్యాంపు-1 పాఠశాల చైర్మన్‌గా సాంబశివరావు, క్యాంప్-2 పాఠశాల చైర్మన్‌గా పి.లలిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపికైన కమిటీ సభ్యులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

మాచవరం: మండలలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు ఎ.శ్రీనివాసరెడ్డి, డి.శ్రీధర్‌లు తెలిపారు. మండలంలోని 28 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 5 జెడ్పీ హైస్కూల్స్, 1 కేజీబీవీ పాఠశాలలో ఎన్నికలు జరిగాయని తెలిపారు. అన్ని కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు వ్యవహరించారు. పిల్లుట్ల కేజీబీవీ పాఠశాలను జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వర్లు సందర్శించి, ఎన్నికలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే డిజిటల్ బోధన వసతులు ఉన్నాయని, వాటిని వినియోగించుకొని పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని అన్నారు. ఎంపీడీవో సురేష్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో ఏకగ్రీవమే

వెల్దుర్తి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈవో కాంతారావు తెలిపారు. గుండ్లపాడు జెడ్పీహైస్కూల్ చైర్మన్‌గా తోట శ్రీనివాసరావు, శిరిగిరిపాడు జెడ్పీహైస్కూల్ చైర్మన్‌గా తోట వెంకట గురవయ్యలు ఎన్నికయ్యారన్నారు. మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నిక పూర్తయిందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

సజావుగా విద్యా కమిటీ ఎన్నికలు

దుర్గి: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికలు మండల వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. 39 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. దుర్గి జెడ్పీహెచ్ఎస్ విద్యా కమిటీ చైర్మన్‌గా శీలం దానయ్య, వైస్ చైర్మన్‌గా రాయపాటి సునీత, ఓబులేశునిపల్లె ఎంపీయూపీ చైర్మన్‌గా కొమ్ము కృష్ణ, వైస్ చైర్మన్‌గా ఝాన్సీ.. అడిగొప్పల జెడ్పీహెచ్ఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సుబ్బలక్ష్మి, జంగమహేశ్వరపాడు ఎంపీయూపీ చైర్మన్ గుమ్మా శివ, వైస్ చైర్మన్ కందుల జయమ్మ, కంచరగుంట, ఆత్మకూరు ఎంపీయూపీలకు చైర్మన్లుగా నాగేశ్వరరావు, రామారావు, ముటుకూరు జెడ్పీహెచ్ఎస్ చైర్మన్ మరియదాసు, వైస్ చైర్మన్లగా రమాదేవిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎంఈవో బెంజిమెన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాదాపుగా అధికార కూటమికి చెందిన వ్యక్తులే ఎన్నిక కావటం విశేషం.



దాచేపల్లి ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన అంబటి రవిని సన్మానిస్తున్న దృశ్యం



కారెంపూడి మెయిన్ స్కూల్లో ఎన్నిక నిర్వహిస్తున్న హెచ్ఎం పుల్లమ్మ



కొప్పునూరు జెడ్పీహెచ్ఎస్‌లో చైర్మన్‌గా వీరాంజనేయులు, వైస్ చైర్మన్ కుమారి, హెచ్ఎం



దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన షేక్ హఫీజ్‌ని సన్మానిస్తున్న దృశ్యం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైర్మన్ నాయక్, వైస్ చైర్మన్ ధనలక్ష్మి, హెచ్ఎం లక్ష్మి



మంచికల్లు ఎంపీయూపీఎస్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్న హెచ్ఎం వసంతకుమారి



పిల్లుట్ల కేజీబీవీలో నూతన కమిటీ సభ్యులతో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



గుండ్లపాడు జెడ్పీహైస్కూల్‌లో...



దుర్గి జెడ్పీహెచ్ఎస్‌లో...



ముటుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో...

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

మండల విద్యాశాఖాధికారి

నూతనంగా ఎన్నికైన పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.కాంతరావు, సాంబశివరావులు తెలిపారు. పాఠశాలల్లోని సమస్యలు గుర్తించి హెచ్ఎంలతో సమన్వయమై పరిష్కారం చూపాలన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వం విద్యార్థులు అందించే పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గోగులపాడు హైస్కూల్‌లో కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం

ప్రజలను దైవ సేవకులు సన్మార్గంలో నడిపించాలి

దైవజనులు ప్రభుకుమార్

రెంటచింతల: చెడు మార్గంలో నడుస్తున్న ప్రజలను గ్రామాలలో క్రీస్తు బోధనలు చేస్తున్న దైవ సేవకులైన పాస్టర్లు సన్మార్గంలో నడిపించాలని నరసరావుపేటకు చెందిన దైవజనులు ప్రభుకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలోని షారోను ప్రార్థన మందిరంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దైవ సేవకుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యహోవా దేవుని కుమారుడైన యేసు క్రీస్తు సూక్తులను అనుసరించి ఇరుగు పొరుగు వారి పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి క్రీస్తు ఆరాధికులుగా జీవించాలని పాస్టర్లు కూడికలు నిర్వహించాలన్నారు. పాస్టర్లు క్రీస్తు సువార్తను ప్రచారం చేసి సమాజంలో శాంతి, సమాధానంతో జీవించాలన్నారు. దైవజనులు డాకూరి ప్రభుదాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో రెవరెండ్ కొమ్ము మోషే, పాస్టర్లు పాల్ ప్రభుదాస్, సుందరరావు, కమిటీ సభ్యులు ఏసోబు, కోటిరెడ్డి, బాలజోజి, డేవిడ్, కొర్నేలి తదితరులు పాల్గొన్నారు.



దైవ సేవకుల సదస్సులో పాస్టర్లు

12 నుంచి సర్పంచులకు శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజులపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీవో ఎస్.జగదీష్ గురువారం తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత, డంపింగ్ యార్డ్‌లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఎరువులను తయారు చేయడం, సైడ్ కాలువల్లో మురుగు తొలగింపు, గ్రామాల్లో నీటి సౌలభ్యత, వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జరుగుతుందని, డైరెక్టర్‌గా ఎంపీడీవో వ్యవహరిస్తారని అన్నారు.

దోమల నివారణతో విషజ్వరాలు దూరం

మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రెంటాల(రెంటచింతల): మన నివాస పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని, దీంతో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రావని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రెంటాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. విద్యార్థులు ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి వంటి లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీర వెంకట వీరయ్య, ఆరోగ్య సిబ్బంది మనీషా, ఉపాధ్యాయులు వెన్నా బుచ్చిరెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునికి దేహశుద్ధి

కారెంపూడి: ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు తెలపడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేసిన ఘటన కారెంపూడి మోడల్ స్కూల్లో గురువారం చోటు చేసుకుంది. తమ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బోరుగడ్డ రవికుమార్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని కొందరు విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు సుమారు 20 మంది ఉపాధ్యాయునిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనికి దేహశుద్ధి చేశారు. సమయానికి పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై ఎంఈవో పి.రవి కుమార్ గురువారం విచారణ నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రిపోర్టును పై అధికారులకు పంపుతానని పేర్కొన్నారు. ఎస్ఐ కె.అమీర్ పాఠశాలలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నిరాకరించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయునిపై విద్యాశాఖ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుని పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

పంట నీట మునిగితే ఆందోళన వద్దు

- సస్యరక్షణతో పంట నష్టం నివారణ
- పలు సూచనలు చేస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు



గురజాల : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, కాలువల్లో వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంటున్నాయి. పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మరొక రెండు మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పిడుగురాళ్ల, నకరికల్లు, దాచేపల్లి, మాచవరం కారంపూడి మండలాల్లో సుమారు 110 వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు చాలా ఆలస్యంగా మొదలు కానుంది. రైతులు ఈ ఏడాది కంది వంటి ఇతర పంటల సాగు చేపట్టేందుకు మక్కువ చూపుతున్నారు. అక్కడక్కడ పంట మొలక దశలో ఉన్న సమయంలో నీట మునగడంతో పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను పిడుగురాళ్ల ఏడీఏ కృష్ణదేవరాయలు వివరించారు.



వరి నాట్లు వేసిన పొలం

విత్తనం వేసిన 2-3 రోజుల్లో...

విత్తనం వేసిన 2-3 రోజుల వ్యవధిలో ముంపునకు గురి అయితే మొలక శాతం తగ్గే ప్రమాదం ఉంది. రైతులు తమ మడిలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. దీని వలన విత్తనంకు గాలి తగలటంతో మొలక త్వరగా వస్తుంది. విత్తనం 7-30 రోజుల వ్యవధి నారు మడిలో 5 రోజుల కంటే ఎక్కువ నీరు నిలిచి ఉంటే నారు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ తరుణంలో నీరు పూర్తిగా బయటకు పోనివ్వాలి. గాలి తగిలేలా చేయాలి. తర్వాత 5 సెంట్ల నారు మడికి 1 కిలో యూరియా, 1 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్, వేయడం వలన కొత్త ఆకులు తొడిగి నాట్లు వేయడానికి వీలుంటుంది. తెగుళ్ల అధికంగా ఆశించే క్రమంలో నీరు తీసిన తరువాత మొక్క నిలదొక్కుకున్న క్రమంలో తెగుళ్ల నివారణకు గ్రాము కార్బండిజం లేదా మాంకోజెబ్, మిశ్రమం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పై పాటుగా పిచికారీ చేయాలి.

నారుమడుల్లో...

నాట్లు వేసిన మడులు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా బయటకు పంపించి ఎకరాకు 20 కిలోల యూరియా 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా పై పాటుగా వేయడం శ్రేయస్కరం. నీరు పూర్తిగా తీయకుంటే ఆకుపై 2 శాతం యూరియా లేదా మూడు 19లు పిచికారీ చేయాలి. వరినాట్లు పూర్తిగా కోలుకున్న తరువాత సాధారణ, కుళ్లు తెగుళ్లను అధిగమించేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలి.

• వితంతు పింఛన్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు

రాజుపాలెం: ఎస్సీ, ఎస్టీ, మహిళలు, ప్రత్యేక అవసరాలు గల వారు, ఉచిత న్యాయ సహాయానికి అర్హులని న్యాయ విజ్ఞాన సదస్సు పారా లీగల్ వలంటీర్ బాబూరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు.